విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 21, జూన్ 2023

ఆత్మహత్య చేసుకున్న చినబాబు మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణం తోటిలైనుకు చెందిన చిన్నబాబుపై ఒకటో పట్టణ పోలీసులు అక్రమ ంగా దొంగతనం కేసు మోపి రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురి చేస్తున్నారని, నేను ఏ దొంగతనం చేయలేదని మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా చిత్రహింసలకు గురిచేయడం తో మనస్తాపంతో రైలు క్రింద పడి చనిపో వడం బాధాకరమని, ఈ సంఘటనకు కారకులైన వన్ టౌన్ పోలీసులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిని సస్పెండ్ చేసి ఆత్మహత్యకు పాల్పడిన చిన్నబాబు కుటుంబానికి 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేసియా చెల్లించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో గత కొన్ని నెలలుగా పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టణంలో ఏం జరిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నంద్యాల పట్టణంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. వెంటనే పోలీసుల వేధింపులకు గురై మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న చినబాబు మృతిపై సమగ్ర విచారణ జరిపించి 50లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఇంటర్నల్ స్క్వాడ్ ఏడి తనిఖీ

విశాలాంధ్ర - వెలుగోడు : ఇంటర్నల్ స్క్వాడ్ నందికొట్కూర్ ఏడి విజయ శేఖర్, వెలుగోడు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తో కలిసి వెలుగోడు లోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించడమైనది. ఎరువుల దుకాణాలలో మొక్కజొన్న విత్తనాలు 35.6 క్వింటాలువిలువ 16,85, 800 గల విత్తనాలకు సంబంధిత పిసిలు దుకాణదారులు చూపనందున వాటి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు ఏ.ఓ చెప్పారు. వ్యవసాయ సిబ్బంది వెంకట శివ, రామకృష్ణ, వీఆర్వో అనంత సేన, పోలీస్ సిబ్బంది మాధవరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించండి

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి సోమవారం గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రంగాపురం గ్రామంలో సర్పంచ్ గుమ్మగాళ్ళ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి బుగ్గన నాగ భూషణం రెడ్డి మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా పథకాలను అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని, ప్రజలకు ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన వాగ్దానాలను, నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేసి అందజేయడంలో ఎంతో కృషి చేశారని వారు అన్నారు. అంతేకాకుండా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల ఇంటి వద్దకే చేర్చడంలో దేశంలో గర్వకారణంగా నిలిచిందన్నారు.వీటి తో పాటు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు,రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందడం మనం చూశామన్నారు.ఈ సంక్షేమం ఇలాగే కొనసాగలంటే వచ్చే ఎన్నికల్లో వైయస్సార్పీ జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరారు. వైఎస్ఆర్పిపి నాయకులు గూని నాగరాజు, మోహన్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, గూని నాగేశ్వరరావు,సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, వాల్మీకి ఫెడరేషన్‌డైరెక్టర్‌మురళీకృష్ణ,ఎద్దులన్న పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ సర్వే

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : వైయస్సార్ జగనన్న భూ రక్ష సర్వేలో భాగంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని గోవిందపల్లె గ్రామంలో రెండో విడత రిసర్వే పనులు ప్రారంభించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొదటి విడతలో కొండపల్లి గ్రామంలో రీ సర్వే పూర్తి చేసి రైతులకు భూ రక్ష పత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే ఈ గ్రామంలో ఉన్న 150 మంది రైతులకు సంబంధించిన 605.11 ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. 129 పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి ఉన్నాయన్నారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొరలకుండా జాగ్రత్తలు పాటించాలని విఆర్వోలకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ తులసికృష్ణ, మండల సర్వేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్ వాడి టీచర్ల వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్ : అంగన్వాడీ టీచర్ల వేతనాలు తక్షణమే పెంచాలని అంగన్వాడీ స్టేట్ జనరల్ సెక్రటరీ లలిత అంగన్వాడి అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ ఏఐటీయూసీ నాయకులు అబ్బాస్ అన్నారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ శంషాద్ బేగం కు అంగన్వాడి టీచర్ల సమస్యలను వివరిస్తూ వినతి పత్రాన్ని అందించిన అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ యా ప్ నందు కొత్త వర్షన్ కాకుండా పాత పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ లో ఉన్న వేతనాలు కూరగాయల బకాయిలు, ఇంటి అద్దె బకాయిలు, 1000 రూ అదనంగా ఇవ్వాలని, టి ఏ, డీ ఏ, మరియు 4 సంవత్సరాల పెండింగ్ బిల్లులు కూడా చెల్లించాలని కోరారు. వైయస్సార్ యాప్ నందు అంగన్వాడి స్కూల్ పిల్లలను డిలీట్ చేసే విధానాన్ని కూడా కొనసాగించాలని,పెన్షన్ పద్ధతి కల్పించాలని అలాగే అంగన్వాడి టీచర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తాలూకా కార్యదర్శి చాంద్ నీ, అధ్యక్షురాలు ఇస్తేరు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మిరప రైతుకు కన్నీరు

విశాలాంధ్ర - బనగానపల్లి : బనగానపల్లి మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన రైతులు 2022-2023 సంవత్సరంలో పండించిన మిరప పంటను మిరపకు ధర లేకపోవడంతో గుంటూరులోని మార్కెట్ యార్డులో సుమారు వందమంది మిరప రైతులు నిలువ ఉంచారు. ధర పెరిగినప్పుడు అమ్ముకోవచ్చునని భావించారు. అయితే ఆదివారం ఉన్న పలంగా గొడంలోని ఏసీలు పాడవడం వల్ల మిరప దిబ్బతినిందని రైతులకు గుంటూరు గొడం నుంచి సమాచారం అందడంతో సుమారు వంద మంది రైతులు గుంటూరుకు నంద్యాల రైల్వే స్టేషన్ నుండి బయలుదేరి వెళ్లడం జరిగింది. అక్కడ రైతులు గొడం లో ఉన్న మిరప బస్తాలను చూసి కన్నీరు మున్నీరుగా విలపించడం జరిగింది.ఒక్కో రైతు ఒక ఎకరాకు రెండు లక్షలు వ్యయం చేస్తు5- 10 ఎకరాలు మిరుప పంట వేసి హంగంలో (మార్చి, ఏప్రిల్ నెలలో) ఆశించిన ధర లేకపోవడంతో గుంటూరు గోడంలొ నిలువ చేస్తే యజమాని నిర్లక్ష్యం వల్ల తమ మిరుప బస్తలు నల్లగా మారి, గర్భం పగలడం జరిగిందని ఇప్పుడు వ్యాపారస్తులు సాకుగా చూపి తక్కువ ధరకు కొనుగోలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.గోదయజమాని నిర్లక్ష్యం వల్ల ధర లేకపోయినా ఇప్పటికిప్పుడే అమ్మ వలసి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేదుకున్నారు. లేదంటే ఆత్మహత్యలు శరణమన్నారు.

భారీ వర్షం

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా గంట పాటు ఈదురు గాలులతో, ఉరుములు, మెరుపులతో కూడినవర్షం కురిసింది. పట్టణంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి.గుంతల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షం వలన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ లో ఇలాంటి వర్షం కురవడం మొదటి సారని, భూమి పదును అయ్యే అవకాశం ఉందని, సేద్యంచేసి విత్తనాలు వేయుటకు ఆస్కారం ఉందని రైతులు అన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా హరికిషన్

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా హరికిషన్ మంగళ వారం బాధ్యతలు చేపట్టాడు.ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు సాదారణ బదిలీలలో భాగంగా కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ కాగా జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న హరికిషన్ బదిలీ పై వచ్చి మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గా బాధ్యతలు చేపట్టారు.ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని ఆయన తెలిపారు.

ఎంపిక చేసిన గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు సమకూర్చండి

విశాలాంధ్ర - నంద్యాల : సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన ఐదు గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అవరోధంగా ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకంపై జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపి పోచా మాట్లాడుతూ సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద ఎంపిక చేసిన నంద్యాల మండలంలోని చాబోలు, జూపాడు బంగ్లా మండలంలోని పారుమంచాల, ఉయ్యాలవాడ మండలంలోని బోడెమ్మనూరు, గోవిందపల్లె, కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధికి అవరోధంగా ఉన్న సమస్యలను అన్వేషించి పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత ఇంచార్జ్ అధికారులను ఆదేశించారు. వారానికోసారి గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకుని సంబంధిత సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవడంతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదం చేయాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ మాట్లాడుతూ ఎంపి దత్తత తీసుకున్న 5 గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడం, మెరుగైన ప్రాథమిక సౌకర్యాలు, అధిక ఉత్పాదకత, జీవనోపాధి అవకాశాలు, విస్తృత సామాజిక సమీకరణ తదితర అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, సర్పంచ్ లు, వివిధ శాఖల కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు అమ్మాయికి మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ

విశాలాంధ్ర - వెలుగోడు : వెలు గోడు పట్టణ చరిత్ర- సంస్కృతి అనే అంశంపై పరిశీలన చేసినందుకు మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన జయరాజు కుమార్తె శీలం ఇంద్రజ పొందారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్రంలో పీఠాధిపతి డా, ముసుగు శ్రీనివాస రావు పర్యవేక్షణలో "వెలుగోడు చరిత్ర- సంస్కృతి ఒక పరిశీలన '(నంద్యాల జిల్లా)అనే అంశం మీద పరిశోధన చేసిన శ్రీమతి శీలం ఇంద్రజకు మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను ప్రధానం చేశారు.శీలం ఇంద్రజ ఎంఏ చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠంలో ఎంఏ పూర్తి అయిన తర్వాత మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను పొందిన సందర్భాన్ని పురస్కరించు కొని విశ్వ విద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది , పరిశోధక విద్యార్థులు అభినందనలు తెలిపారు. శీలం ఇంద్రజ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు ఆకాంక్షించారు.

దళితుల సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం

విశాలాంధ్ర - నంద్యాల : దళితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించ

లేకపోతుందని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు విమర్శించారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్చార్జి ప్రసాద్, జిల్లా నాయకులు ప్రభాకర్, చెన్నయ్య, ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో దళితులపై దాడులు అధికమయ్యాయని, దళితులకు రావలసిన సబ్ ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి మళ్ళిస్తుందని, దళితుల పిల్లలు ఉన్నత చదువులు చదివినా ప్రయోజనం లేదన్నారు. రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు రావడం లేదని, ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో దళితులను అంటరానివారిగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం త్వరలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సమితి ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సమస్యల పరిష్కారానికై పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.

వివాహేతర సంబంధంతోనే మహిళా హత్య

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణం మారుతి నగర్ లో గత 17వ తేదీ గుర్రం రాములమ్మ (39) వివాహేతర సంబంధంతోనే హత్యకు గురి కావడం జరిగిందని ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు మంగళ వారం విలేకరులకు తెలియజేశారు. ఆయన నందికొట్కూరు సర్కిల్ పోలీస్ స్టేషన్లో అర్బన్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐఎన్‌వి రమణ ఆధ్వర్యంలో విలేకరులకు తెలియజేస్తూ నందికొట్కూరు పట్టణం మారుతినగర్‌కు చెందిన మాధవరం వెంకటేశ్వర్లు దూరపు అయినా గుర్రం రాములమ్మను పగిడాల గ్రామానికి చెందిన బాలయ్యకు ఇచ్చి సుమారు 20సంవత్సరాల కిందట పెళ్లి చేయగా రాములమ్మ గత ఐదు సంవత్సరాల నుండి తన భర్తతో విడిపోయి మారుతి నగర్‌లో ఉన్న ఆమె తల్లిదండ్రుల వద్ద ఉన్నది. ఆమె తల్లిదండ్రుల సొంత గ్రామం ఎర్రమటం గ్రామం అయితే వారు గత ఎనిమిది సంవత్సరాల నుండి నందికొట్కూరు మారుతినగర్‌లో నివాసముంటున్నారు. రాములమ్మ నందికొట్కూరు టౌన్ పటేల్ సెంటర్‌లో ఉన్న శ్రీనవ్యకళ బట్టల షాపులో పనిచేస్తూ ఉండేదని అయితే గత సంవత్సరం కాలం నుండి వెంకటేశ్వర్లకు, గుర్రం రాములమ్మకు అక్రమ సంబంధం ఏర్పడిందని. ఆమె ఇంటికి అతను పోయేవాడని ఈ మధ్యకాలంలో రాములమ్మ అతనిని ఇంటికి రానిచ్చేది కాదని, దాంతో అతనికి రాములమ్మ పై అనుమానం పెరిగినది ఆమె వేరే వారితో తిరుగుతున్నదని అతనికి తెలిసి ఆమెపై అనుమానంతో ఆమెను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. సమయం కోసం వేచి చూస్తుండగా రాములమ్మ తల్లిదండ్రులు ఊరికి పోయారని రాములమ్మ ఒక్కతే ఇంట్లో ఉన్నదని తెలుసుకొని తన ఇంట్లో ఉన్న కూరగాయల కత్తి తీసుకొని తన పంచలో దాచిపెట్టుకొని ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో రాములమ్మ ఇంట్లోకి వెళ్ళినాడు. రాములమ్మ ఒంటరిగా ఇంట్లో కూర్చొని స్టీల్ గిన్నెలో పూలు అల్లుకుంటుండగా మాట మాట పెంచుకొని వెంటనే అతను ఆమెను వెంట్రుకలు పట్టుకొని తల వెనుకకు వంచి కత్తితో గొంతు కోయగా రక్తం చిమ్మి ఆమె కొద్ది కొద్దిసేప్పటికి చనిపోయినదని తెలిపారు. మృతురాలు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అర్బన్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఎస్సై ఎన్వి రమణ తన సిబ్బందితో ముద్దాయి వెంకటేశ్వర్లు ను నందికొ ట్కూరు కేజీ రోడ్డు మార్కెట్ యార్డ్ సమీపంలో అదుపులోకి తీసుకోవడం జరిగింది. ముద్దాయిని పోలీసులు విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడు. ముద్దాయి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, మృతురాల నుంచి తీసుకు వెళ్లిన రెండు తులాల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముద్దాయిని కోర్టులో హాజరు పరిచారు.

కొండమీది గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించండి

విశాలాంధ్ర - అవుకు : మండలంలోని అన్ని గ్రామాలలో వర్షాలు పుష్కలంగా కురిసిన కొండమీది గ్రామాలలో వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండలాధ్యక్షుడు చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వర్షపాతం నమోదు విషయంలో మండలాన్ని ఒక యూనిట్ గా తీసుకోవడం వలన కొండమీది గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అలాగే రానున్నది గాలి కాలం కావడం వలన విద్యుత్ స్తంభాలు ఒరిగి పోకుండా, పడిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా చెర్లోపల్లి రామాపురం గ్రామాల మధ్య ఉన్న జాతీయ రహదారి రోడ్డు మరమ్మతులు చేయాలని జాతీయ రహదారి అధికారులను కోరారు. జలాశయం స్లూయిస్ సమస్య పరిష్కరించి ,వంట కాలువల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఆర్బిసి అధికారులను కోరారు. సభలో ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ నెలలో రెండుసార్లు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. బాల్య వివాహాల వలన గర్భసంచి ఎదుగుదల లేకపోవడంతో ఊపిరితిత్తుల సమస్య, గుండె పెరుగుదల లేకపోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. విద్యాధికారి శ్రీధర్ రావు మాట్లాడుతూ మండలంలో టీచర్ల బదిలీల వలన 26 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని అన్నారు. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు జూన్ ఆఖరిలోగా మినిమం టైం స్కేల్ కింద మరియు 1998 డిఎస్ వారిని నియమించే అవకాశం ఉందని అన్నారు. పాఠశాల ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుకను అందజేశామని అన్నారు. వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ మాట్లాడుతూ వైయస్సార్ యంత్ర సేవా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిఈ సునీల్ రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు తెలుగు రామప్ప, డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్ బాబు, పంచాయతీరాజ్ ఏఈ మహమ్మద్ గౌస్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కరిముల్లా, విద్యాధికారి 2 వై వెంకటేశ్వర రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హనీఫా, వెలుగు ఏపిఎం విజయ గోపాల్, ఈవో ఆర్డీ రామకృష్ణ వేణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శివమ్మ, ఈవో అశ్విన్ కుమార్ ఎంపీటీసీలు వెంకట సుబ్బారెడ్డి,వెంకటేశ్వర్లు, వెంకట లక్ష్మమ్మ,మాజీ సర్పంచ్ ముడియం శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.

సీడ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం

విశాలాంధ్ర - మిడుతూరు : మండలంలోని ఏ డీలర్ కూడ నకిలీ విత్తనాలు అమ్మిన మరియు బయటి వ్యక్తులు ఎవరైనా అమ్మినా వారిపై సీడ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి పీరు నాయక్ తెలిపారు. మండల పరిధిలోని విత్తన విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టినటువంటి టాస్క్ ఫోర్స్ సిబ్బంది మండల వ్యవసాయ అధికారి ఎం.పీరు నాయక్ సీడ్ యాక్ట్ కింద నమోదు చేస్తాం అని మండల తహ శీల్దార్ ప్రకాష్ బాబు మరియు ఎస్సై మారుతి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలాగే కిసాన్ అగ్రిమాల్ వారికి పత్తి, మొక్కజొన్న విత్తనాల కి సంబంధించి 494492/- రూపాయల విలువైన విత్తనాలు నిలుపుదల చేయడం జరిగింది. అధికారులు మాట్లాడుతూ మండలంలోని ఏ డీలర్ కూడ నకిలీ విత్తనాలు అమ్మిన మరియు బయటి వ్యక్తులు ఎవరైనా లూస్ విత్తనాలను అమ్మినా వారిపై సీడ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏడు మంది విఆర్వోలు బదిలీ

విశాలాంధ్ర - అవుకు : మండలంలో పనిచేస్తున్న ఏడు మంది విఆర్వోలు బదిలీ అయినట్లు డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్ బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉప్పలపాడు విఆర్ఓ సుబ్బరాయుడు గోస్పాడుకు, కునుకుంట్ల వీఆర్వో రుక్సానా గోస్పాడుకు, జూనూతల విఆర్ఓ ప్రవీణ్, సింగనపల్లి విఆర్ఓ రాజ్యలక్ష్మి, సుంకేసుల విఆర్ఓ సుజాతాలు కోవెలకుంట్ల, మంగంపేట విఆర్ఓ కులాయప్ప మీరాపురానికి బదిలీనట్లు తెలిపారు.

పొలం కోల్పోతున్న రైతులకు న్యాయమైన ధర నిర్ణయిస్తాం

విశాలాంధ్ర - బనగానపల్లి : పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో డోన్ ఆర్ డి ఓ వెంకట్ రెడ్డి యనకల జయ జ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వే ట్రాక్ కొరకు ల్యాండ్ ఎక్కువేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు తమ పొలాలు రెండు పంటలు పండుతున్నాయి అధిక ధర నిర్ణయించాలని ఆర్డీవోకు తెలిపారు. ఆర్డీవో వెంకటరెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు తెలియపరుస్తానని రైతులకు సూచించారు. తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఆర్ ఐ రాఘవేంద్ర, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

విశాలాంధ్ర - నంద్యాల : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎఐటియుసి నాయకులు పేర్కొన్నారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో గౌండ కార్మికుల సమస్యలపై విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఎఐటియుసి రాష్ట్ర పిలుపుమేరకు విజయవాడకు బయలుదేరిన నాయకులను అరెస్టు చేసి నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అని అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని దీనిని తీవ్రంగా ఖండిస్తూ స్థానిక సంజీవన గేట్ దగ్గర కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. నంద్యాల పట్టణ ఎఐటియుసి కార్యదర్శి డి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు భూమని శ్రీనివాసులు, నాయకులు దానం,ఖాజా, సిద్దిక్, రమేష్ భాష కార్మికులు పాల్గొన్నారు.

జూలై నెల నుండి మూడు కిలోల రాగులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నియోజకవర్గంలోని రేషన్ కార్డుదారులకు జూలై నెల నుండి పిడిఎస్ బియ్యానికి బదులుగా మూడు కిలోల రాగులను ఉచితంగా అందజేస్తున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నెలనెలా రేషన్ కార్డుదారులకు ఇచ్చే పిడిఎస్ బియ్యాన్ని ఎవరికైనా విక్రయిస్తే అట్టి వారి రేషన్ కార్డును తొలగిస్తామన్నారు. పిడిఎస్ బియ్యాన్ని ఎవరు కొనరాదన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ కార్డుదారులకు కార్డుకు కిలో 16 రూపాయలకే గోధుమపిండి అందజేస్తామన్నారు.

మండల విద్యాధికారి 2గా వెంకటేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - అవుకు : అవుకు మండల విద్యాధికారి 2గా వై వెంకటేశ్వర్ రెడ్డినీ ఉన్నతాధికారులు నియమించడంతో ఈమెకు మంగళ వారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రతి మండలానికి రెండవ విద్యాధికారిని నియమించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కో జిల్లా పరిషత్ బాలు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర రెడ్డికి పదవున్నది కల్పిస్తూ విద్యాధికారి 2గా జిల్లా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. విద్యాధికారి 1 అడ్మినిస్ట్రేషన్, అకాడమిక్ వ్యవహారాలు చూసుకోగా, విద్యాధికారి 2 నాన్ అకాడమిక్ వ్యవహారాలు చూసుకొన్నారు. విద్యాధికారి శ్రీధర్ రావు, మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ముచ్చల పురి శ్రీనివాసులు, కేబీఎన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, సిఆర్పిలు శ్రీనివాసులు, రామ్మోహన్, భాష తదితరులు పాల్గొన్నారు.

తహసిల్దార్‌ను కలిసిన రైతులు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో గల సుమారు 15 మంది రైతులు మంగళవారం తాసిల్దార్ షేక్ మొహిద్దిన్ కలిసి రస్తా సమస్యను పరిష్కరించాలని కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా యర్రగుంట్ల గ్రామానికి చెందిన జంబునబోయిన హనుమంతయ్య ఇతర రైతులు నంద్యాల జిల్లా కలెక్టర్ కు నంద్యాల జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేసి పొలం కొనుగోలు చేసిన విస్తీర్ణానికంటే అధికంగా ఆన్లైన్ చేయించుకొని రస్తాను కబ్జా చేశారని ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. తహసిల్దార్ షేక్ మొహిద్దిన్ 519 సర్వే నెంబర్ గల రాస్తాను సర్వే చేసి రైతుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చేయాలని వి అర్ ఓ ను ఆదేశించారు.

ఫీజుల దందాను ఆపండి

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి మండలంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దందాను ఆపాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఆర్ఎస్ఏ) అధ్యక్షులు జగన్ కోరారు. చాగలమర్రి పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో అనురాధకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చాగలమర్రిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విచ్చల విడిగా ఫీజులు వసూలు చేస్తున్నాం న్నారు. పుస్తకాలు అమ్మకూడదని నిబంధనలు ఉన్నా వాళ్ల వ్యాపారం కోసం పాఠశాలలోనే అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్నారని విమర్శించారు.అధికారులు. స్పందించి విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకుచిల్లులు పడకుండా చూడాలని కోరారు.

సీఎం జగన్ స్పందించకపోవడం దారుణం

విశాలాంధ్ర - నంద్యాల : పదవ తరగతి చదువుతున్న విద్యార్థి అమర్నాథ్‌ను సజీవ దహనం చేసినా సీఎం జగన్ స్పందించకపో వడం దారుణమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్ఎండి ఫరూక్ ఆరోపించారు. నంద్యాల పట్టణంలోని ఖలీల్ థియేటర్ ప్రాంగణంలోని టిడిపి కార్యాలయంలోనిర్వహించిన మీడియా సమావేశంలో ఫరూక్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా చేరుకుపల్లి ఉప్పాలవారిపాలెంలో అమర్నాథ్ అనే పదో తరగతి విద్యార్థి తన అక్కను ఎందుకు వేధించారని ప్రశ్నించినందుక అతి కిరాతంగా పెట్రోల్ పోసి సజీవ దహనం చేస్తే ముఖ్యమంత్రిలో కనీస స్పందన లేకపోవడం దారుణమన్నారు. బాధిత కుటుంబం స్థానిక సీఐకి ఫిర్యాదు చేస్తే వెంటనే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బాధితుడి తల్లి వద్దకు వెళ్లిన వైసిపీ ఎంపీ,మంత్రులు కేసు పెట్టొద్దు, ఆయా ఉద్యోగం ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. హత్యకు గురైన బాలుడు అమర్నాథ్ కుటుంబానికి 10లక్షలు ఆర్థిక సహాయం, సోదరిని ఎన్టీఆర్ ట్రస్టు తరఫున దత్తత తీసుకుంటున్నట్లు చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేసి నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

సైకో వార్డెన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : విద్యార్థుల చేత బాత్రూమ్ లను కడిగించడమే కాకుండా వారికి అన్నం కూడా సరిగా పెట్టకుండా వేధిస్తున్న సైకో వార్డెన్ వెంకటరెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న, నగర కార్యదర్శి మునిస్వామిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూల్ నగరంలో ఎస్సీ మేనేజ్మెంట్ కాలేజ్ హాస్టల్ వార్డెన్ వెంకటరెడ్డిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం స్థానిక కర్నూలు బళ్లారి చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. సందర్భంగా సోమన్న ముని స్వామిలు మాట్లాడుతూ వార్డెన్ ప్రశ్నించిన ప్రతి విద్యార్థి మీద కక్ష సాధింపు చర్యగా రౌడీలు,వీధి గుండాలతో విద్యార్థులను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులు బాత్రూం కడగలేదన్న కారణంగా ఆ విద్యార్థుల రూములకు తాళాలు వేసి వారి సామాన్లు బయటకు విసిరేశారని,ఇదే ఏమని విద్యార్థులు అడిగినందుకు వెంటనే డయల్ 100 కి కాల్ చేసి పోలీసులను పిలిపించి తిరిగి విద్యార్థుల పైన ఫిర్యాదు చేయడం దారుణం అన్నారు. పోలీసులు కూడా విద్యార్థులను వీధి గుండాల్లాగా కొట్టడం బాధాకరమన్నారు. విద్యార్థులకు ఇచ్చే నిత్యవసర సరుకులు కూడా సహా చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా విద్యార్థుల పైన పోలీసులతో దాడి చేపించిన వార్డెన్ వెంకటరెడ్డిని సస్పెండ్ చేయాలని లేకపోతే సంక్షేమ భవనం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర సహాయ కార్యదర్శి ఎస్. విజయ్ కుమార్, నగర నాయకులు మధు. ప్రసాద్, బాధిత విద్యార్థులు సందీప్, భువనేష్, రాము, కిషోర్, ప్రసాదు, కృష్ణలు పాల్గొన్నారు.

ఒకే ఉపాధ్యాయుడితో విద్యార్థులకు విద్యాబోధన ఎలా అందుతుంది

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలోని సులు వాయి కన్నడ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక ఏకోపాధ్యాయు డతో నడుస్తున్నదని దీనివల్ల విద్యార్థులకు విద్యాబోధన ఎలా కొనసాగుతుందంటూ స్కూల్ కమిటీ చైర్మన్ మల్లి ఇం చార్జ్ ఎంఈఓ ఈరన్నను ప్రశ్నించారు. ఎంఈఓ ఈరన్నకు మంగళవారం ఎస్ఎంసి కమిటీ చైర్మన్ మల్లి వినతి పత్రాన్ని సమర్పించారు.మల్లి మాట్లాడుతూ ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం ఒక్క ఉపాధ్యాయుడే పనిచేస్తున్నా దని 120 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు ఎలా బోధిస్తాడని ఆరోపించారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు విద్యాపట్ల ఆసక్తి చూపడం లేదని ఆటపాటల్లో నిమగ్నమవు తున్నారని వాపోయారు. విద్యాబోధన ఎలా అందుతుందని దీనివల్ల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు నియమించి విద్యాభి వృద్ధికి సహకరించా లని ఎస్ఎంసి కమిటీ చైర్మన్ మల్లి సభ్యులుగిరి వల్ల ఎండి రఫీమస్తాన్ వీరేష్ శివశంకర్ ప్రజలు డిమాండ్ చేశారు. ఎంఈఓ ఈరన్న సమాధానం ఇస్తూ ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాల కార్మికులను పనిలో చేర్పించుకుంటే నేరమే

విశాలాంధ్ర - హొళగుంద : బాల కార్మికులను అంగళ్ల కిరాణా బట్టల దుకాణ్లు హోటళ్లు మెకానిక్ షాపులు ఇతర అంగళ్లలో చేర్చుకొని పని చేయిస్తేనేరమేనని నేషనల్ చైల్డ్ లెబర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్సీ రంగారెడ్డి అన్నారు. హొళగుందలో సోమవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలను ఎవరైనా పనిలో చేర్పించు కుంటే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. బాల కార్మికులను చేర్పించుకుంటే 50వేల రూపాయలు జరిమానా రెండేళ్లు జైలు శిక్ష ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడి ఈడు పిల్లలను విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నదని అందువల్ల ప్రజలు విద్యార్థులకు బడి ఈడు పిల్లలకున్నాల పైన విద్యను అందించాలని విజ్ఞప్తి చేశారు. అందరూ పిల్లలు బడి లో ఉండాలని కిరాణాంగళ్లు దుకాణాలు పలు పనులు ఇతర అంగళ్లలో ఉంటే అలాంటి యజమానులపై కేసులు నమోదు చేస్తా మని స్పష్టం చేశారు. సున్నా నుండి 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను ఎవరు పనిలో చేర్చుకోవద్దని కోరారు. బాల కార్మికులుగా పట్టుబడిన పిల్లలకు కర్నూల్లో విద్యాభ్యాసం కోసం చైల్డ్ వెల్ఫేర్ సెంటర్లు తరలిస్తామని అన్నారు. తనిఖీలో ఆలూరు లేబర్ ఆఫీసర్ కనక లక్ష్మి,ఆదోని లేబర్ ఆఫీసర్ వెంకటరాముడు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ నాయక్ ,ఫామా,జనరల్ స్టోర్ కిరాణా యజమాని మస్తాన్ ,శిక్షావలి ,షబ్బీర్ ,పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైద్ధాంతికంగా కృషి చేయాలి

విశాలాంధ్ర - పత్తికొండ : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైద్ధాంతికంగా కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని గోపాల్ ప్లాజా ఫంక్షన్ హాల్ లో సీపీఐ జిల్లా స్థాయి సైద్ధాంతిక,రాజకీయ శిక్షణ తరగతులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ప్రారంభించారు. ముందుగా సీపీఐ సీనియర్ నాయకులు వి.భీమలింగప్ప పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.రామ కృష్ణ మాట్లా డుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, పెరిగిన ధరలను తగ్గిస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చి 9సంవత్సరాలు అయినాచేసిందేమీ లేదన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, సామాన్య ప్రజలు ఏమీ కొనలేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటే విధంగా పెంచేశారన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావా ల్సిన నిధులు, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశా లను సాధించడంలో సీఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. 2024 ఎన్నికలలో కేంద్రంలో నరేంద్ర మోదీని, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపుదామని, పార్టీ శ్రేణులు ఆ వైపుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డ య్య, జిల్లా సహాయ కార్యదర్శులు మునెప్ప, ఎస్.ఎన్. రసూల్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు,జిల్లాకార్యవర్గసభ్యులు నబీ రసూల్, డి.రాజా సాహెబ్, జి.రంగన్న, జగన్నాథం, రామకృష్ణారెడ్డి, మద్దిలేటి శెట్టి, కారు మంచి, చంద్రశేఖర్, శ్రీరాములు గౌడ్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, తిమ్మయ్య, కృష్ణయ్య,సుల్తాన్,శ్రీనివాసులు,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు వెంకటరాముడు, నాగరాజు, పార్టీ వివిధ మండలాల కార్యదర్శులు, పట్టణ, శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21న నిర్వహిస్తు న్నారు. డాక్టర్. అర్షద్ కన్సల్టెంట్ ఫిజియో థెరపిస్ట్ కిమ్స్ హాస్పిటల్, మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి చైతన్యం కలిగించడమే అంతర్జా తీయ యోగా దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. యోగా అనే పదం సంస్కృ తం యుజ అనే దాని నుండి వచ్చింది. యుజ అంటే చేరడం లేదా ఏకం చేయడం అని అర్థం. శరీరం, మనసును ఏకం చేయడమే యోగాలోని పరమార్థం. దాదాపు 500 ఏళ్ల చరిత్ర కలిగిన యోగా శాస్త్రం ప్రపంచానికి భారతీయులు అందించిన అద్భుతమైన కానుక. శాంతి కోసం యోగా అనే నినాదంతో ఆ ఏడాది యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ప్రజలకు మంచినీటి సరఫరా చేస్తాం

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలోని వందవాగలి ప్రజలకు మంచినీటి సరఫరా చేస్తామని మండల సింగల్ విండో చైర్మన్ ఎం మల్లికార్జున అన్నారు. గ్రామంలోని పేప కాలనీజనన్న కాలనీలో జిల్లా జడ్పీ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ రెండు లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. దీనితో మంగళవారం కొత్త మంచినీటి పైప్లైన్ పనులను వైకాపా నాయకులు ప్రారంభించారు. జడ్పీ నిధులతో బిసికాలనీ జగనన్న కాలని ప్రజలకు మంచినీటి సరఫరా చేయడానికి కొత్తగా పైప్ లైన్ వేస్తున్నామని అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దేవరగట్టు మాల మల్లేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు వైకాపా తాలూకా ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి సహకారంతో గ్రామాభివృద్ధి చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రామానికి నిధులు మంజూరు చేసినందుకు జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు నీటిని వృధా చేయకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కోగి ల తోట శేషప్ప, జయన్న ,వెంకటేష్ ,తిమ్మప్ప ,తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - మంత్రాలయం : సమరశీల ఉద్యమాల రథసారథి ఏఐఎస్ ఎఫ్ రాయలసీమ జిల్లా శిక్షణా తరగతులను జులై 3,4,5 తేదీలలో కర్నూలు జిల్లా మంత్రాలయంలో నిర్వహిస్తున్నామని, వాటిని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం శిక్షణ తరగతులను సంబంధించిన కరపత్రాలను మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్పచెప్పి విద్యను మొత్తం ప్రైవేటీకరణ చేస్తున్నారు. దీంతో మధ్య తరగతి ప్రజలు చదువుకోవడం మానేస్తున్నారు. దేశంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పి పాఠ్యపుస్తకాలలో రాజ్యాంగ చరిత్రను చెరిపేస్తున్నారు. రాష్ట్రంలో రేషనలైజేషన్ పేరుతో ఉన్న స్కూళ్లను ఎత్తివేస్తూ విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తూ మిగులు ఉపాధ్యాయ పోస్టులను చూపిస్తున్నారని, అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులను కొనుగోలు చేయాలని చెప్పడం ప్రభుత్వ విద్యపై చిత్తశుద్ధి ఏమాత్రం ఉందో అర్థం చేసుకోవచ్చని వారు తెలిపారు. నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి విద్యార్థులపై పెద్ద ఎత్తున భారం మోపుతున్నారని, అర్థం కాక విద్యార్థులు ఉన్నారని, తక్షణమే ఎన్సీఈఆర్టీ పుస్తకాలలో ఉన్న పాఠ్య భాగాలు యథావిధిగా కొనసాగించాలని,దానిని వ్యతిరేకిస్తూ రాజీనామా చేసిన కూడా కేంద్రానికి ఎటువంటి సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండటం దారుణం అని అన్నారు. విద్యారంగంలో వస్తున్న సమూల మార్పులపై చర్చించేందుకు జులైలో రాయలసీమ జిల్లాల శిక్షణ తరగతులు మూడురోజుల పాటు మంత్రాలయంలో నిర్వహిస్తున్నామని,ఈ శిక్షణ తరగతులకు విద్యావేత్తలు, మేధావులు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్ లు వస్తున్నారని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ఈ మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు విజయవంతం చేసేందుకు అన్ని వర్గాలు సహకారం చాలని కోరుతున్నాము. కరపత్రా లు విడుదల చేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ విజ యేంద్ర,షాబీర్ బాషా, థామస్,రంగస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు దస్తగిరి, జాన్, రాము,ఇమ్మనియేల్,అశోక్,స్టీఫెన్,అనిల్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని దినాలను పెంచాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఉపాధి హామీ పని దినాలను మరింతగా పెంచాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో డ్వామా, పంచాయతీ రాజ్ అధికారులతో పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల శాతాన్ని గణనీయంగా పెంచాలన్నారు. కొన్ని శాతం నమోదు చేసిన ఎమ్మిగనూరు, వెల్దుర్తి ఏపిడిలను కలెక్టర్ వివరణ కోరారు.. సాంకేతిక సమస్య వల్ల హాజరు నమోదు చెయ్యలేక పోతున్నామని వారు వివరించారు. ఆధార్ అనుసంధానంకు సంబంధించి పెండింగ్ ఉన్న పనులను వేగవం తంగా పూర్తి చేయాలన్నారు. మినీ గోకులం పనులకు సంబంధించి పెండిం గ్ ఉన్న చెల్లింపులు పూర్తి చేయాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాలకు సంబంధించి నిర్మాణాలను పూర్తి చేసేలా చూడాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏమైనా నగదు రికవరీలు ఉంటే సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తిని కలెక్టర్ ఆదేశించారు. డ్వామాకు సంబంధించి 2021-22 ఆర్థిక సంవత్సరంలో పెండింగ్ పనులపై కలెక్టర్ ఆరా తీయగా 286 పనులను క్లోజ్ చేయడం జరిగిందని, అదే విధంగా అమృత్ సరోవర్ ట్యాంకులకు సంబంధించి నిర్దేశించిన 75 ట్యాంకుల నిర్మాణం పూర్తి చేయ డం జరిగిందని, హార్టికల్చర్ ప్లాంటేషన్ కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యా లను పూర్తి చేశామని డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు వివరిం చారు.పంచాయతీ రాజ్ కు సంబంధించి ప్రాధాన్యతా భవనాల పనులలో వేగం పెరగాలని కలెక్టర్ ఆదేశించారు.. డిజిటల్ లైబ్రరీలకు అవసరమైన స్థలాన్ని గుర్తించి త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల న్నారు. ఒక నిర్దిష్టమైన ప్రణాళిక వేసుకొని నిరత సమయంలో నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఎక్విపిమెంట్, స్టేజ్ కన్వర్షన్ మీద మెరుగైన పురోగతి సాధించాలన్నారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. సమావేశం లో డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రమణ్యం, డిఈలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర - పత్తికొండ : ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రాజేష్ గౌడ్ పై బనాయించిన అక్రమ కేసును ఎత్తివేయాలని ఏపీయూ డబ్ల్యూజే జాతీయ సమితి సభ్యులు కొండప్ప, నాగరాజు, జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు నాగరాజు గౌడ్, శ్రీనివాసులు గౌడ్ లు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీయూడబ్ల్యూజే నాయకులు డీఎస్పీ శ్రీని వాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ మండలంలోని హోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్త సేకరణకు వెళ్లిన రాజేష్ గౌడ్ పై అధికార పార్టీ నాయకులు దాడి చేయడం జరిగిందని, దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని పత్తికొండ అర్బన్ సీఐ మురళిమోహన్ కు రాజేష్ గౌడ్ ఫిర్యాదు చేశారని, పోలీసులు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేస్తూ, అక్రమంగా రాజేష్ గౌడ్ పై కూడా కౌంటర్ కేసు నమోదు చేయడం సరైంది కాదన్నారు. ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రాజేష్ గౌడ్ పై పెట్టిన అక్రమ కేసును తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పాము కాటుకు గురి అయిన భార్యాభర్తలు

పరిస్థితి విషమించటంతో భార్య లక్ష్మి మృతి

విశాలాంధ్ర - సి.బెళగల్ : రాత్రి మిద్దె పై నిద్రిస్తున్న భార్యాభర్తలు పాము కాటుకు గురి అయి భార్య మృతి చెంది భర్త హాస్పిటల్లో చికిత్స పొందు తున్న సంఘటన సిబెళగల్ మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుండ్రేవుల గ్రామానికి చెందిన భాస్కర్ మరియు ఆయన భార్య లక్ష్మి సోమవారం రాత్రి మిద్దెపై భార్యాభర్తలు ఇద్దరూ నిద్రిస్తుండగా మొదట భాస్కర్ ను మెడపై పాము కాటు వేసింది నిద్రలోనేలేచి పామును చేత్తో పట్టుకొని అటువైపు పారవేశాడు. అటువైపు పారవేసిన పాము వెంటనే భార్య కాలుకు కూడా కాటు వేసింది. వెంటనే భార్యాభర్తలిద్దరు మిద్దెపై నుంచి కిందికి దిగివచ్చి పాము కాటు వేసిన విషయాన్ని వారి వాళ్లకు విషయం తెలియజేశారు. అయితే వారు వెంటనే మిద్దె పైకి ఎక్కి పామును చంపి వేయడం జరి గింది. అప్పటికే భార్యాభర్తలిద్దరికి నోట్లో నురుగు రావడంతో ఆటోలో చింతమాను పల్లి గ్రామంలో పాము కాటుకు మందు వేసే వాళ్ళ దగ్గరకు వారిని తీసుకెళ్లారు. అయితే వారు పామును చంపినారు కాబట్టి మేము మందు వేసినా కూడా పని చెయ్యదని అని చెప్పడంతో హుటాహుటిన మెరుగైన చికిత్స కొరకు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భాస్కర్ భార్య లక్ష్మీ హాస్పిటల్లో రాత్రి మృతి చెందింది. భర్త భాస్కర్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో హాస్పిటల్లోనే చికిత్స పొందుతున్నారు. భాస్కర్ లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు. స్కూలు తెరవడంతో సోమవారం రోజున భాస్కర్ తన ముగ్గురు పిల్లలను తీసుకొని కర్నూల్ స్కూల్లో వదిలిరావడం జరిగింది.

కెనాల్ పై అక్రమ డీజిల్ మోటర్లు వేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - చిప్పగిరి : హెచ్ ఎల్ సి కెనాల్ కింద బ్రాంచ్ కెనాల్ పై నాన్ ఆయకట్టు రైతులు అక్రమంగా డీజిల్ మోటర్లు వేస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తప్పవని చిప్పగిరి తాసిల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని డేగల హాల్ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఆలూరు బ్రాంచ్ కెనాల్ పై బ్రాంచ్ ఇరిగేషన్ డి ఈ మంజునాథ్ ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలూరు బ్రాంచ్ కెనాల్ పై ఏ ఒక్క రైతు కూడా డీజిల్ మోటర్లు వేయకూడదని ఆయకట్టు రైతులకు సూచించారు. ముఖ్యంగా ఆయకట్టు రైతులు ఆయకట్టు పొలాలలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పైపులు వేస్తూ కిలోమీటర్లు పొడుగునా నాన్ ఆయకట్టు రైతులు అక్రమంగా సాగునీటిని తరలిస్తున్నారని తమ దృష్టికి రావడం వల్ల ఆలూరు బ్రాంచ్ కెనాల్ పై పర్యటించి ఆయకట్టు రైతులకు అక్రమ మోటార్లపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యముగా రైతులు అక్రమంగా డీజిల్ మోటర్లు వేస్తే ఎలాంటి చర్యలకు దిగకుండా ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. కెనాల్ పై అక్రమంగా డీజిల్ మోటర్లు బిగిస్తే అట్టి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని నాన్ ఆయకట్టు రైతులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డేగల హాల్ సర్పంచ్ నీలకంఠ, ఇరిగేషన్ జెఇ లు తిమ్మారెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పై నిందలు వేయడం సరికాదు

విశాలాంధ్ర - దేవనకొండ : మాజీ జడ్పీటీసీ సభ్యులు కప్పట్రాళ్ల బొజ్జమ్మ వైసీపీ లోకి వెళ్లా టీడీపీ పై నిందలు వేయడం సరికాదని టీడీపీ మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడ్డె ఏళ్లుగా టీడీపీలో అనేక పదవులు బొజ్జమ్మ కుటుంబం అలకరించిందని ఇప్పుడు న్యాయం జరగలేదని టీడీపీ పై ఆరోపణలు సరికాదన్నారు. 2019లో పార్టీలో ఉంటూనే వైసీపీ కి మద్దతుగా ఎవ్వరు నిలిచారని గుర్తించుకొని టీడీపీ పై ఆరోపణలు చేయాలని పార్టీ మీకు న్యాయం చేసిందని మీరు మాత్రం పార్టీకి ద్రోహం చేశారని,మీరు ఫ్యాక్షన్ గొడవలతో పెట్టకొని నియోజకవర్గ ఇంచార్జ్ సుజాతమ్మ పై ఆరోపణలు సరికాదన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బడిగింజల రంగన్న, రామారావు నాయుడు, వీరేష్,మల్లికార్జున గౌడ్, ఉరికిపు, రాఘవేంద్ర గౌడ్,బుర్రకుంట బజారిగౌడ్, మల్లయ్య, శేఖర్ గౌడ్, చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

13 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడి

విశాలాంధ్ర - గోనెగండ్ల : గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామంలో దారుణం చోటుచేసుకుంది గ్రామానికి చెందిన 13 ఏళ్ల మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన 40ఏళ్ల తెలుగు చిన్నబడేసాబ్ అలియాస్ కొప్పోడు అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు చిన్న బడేసాబ్ భార్య జబ్బమ్మ అలియాస్ బొడెమ్మ నిన్న రాత్రి సమయంలో బహిర్భూమి కు వెళ్తుండగా తోడుగా ఈ 13 ఏళ్ల బాలిక ను తీసుకొని వెళ్లి ఊరి బయట అప్పుడే కాపు కాసిన తన భర్తకు ఆ బాలికను అప్పగించి వచ్చింది.ఆపై బాలికపై బడేసాబ్ విచక్షణ రహితంగా అత్యాచారయత్నం కు పాల్పడ్డాడు బాలిక ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో తల్లితండ్రులు బాలిక కోసం వెతుకుతు బాలిక అరుపులను విని దగ్గరికి వెళ్లగా గ్రామస్తులను చూసిన బడేసాబ్ వెంటనే అక్కడ నుండి పరారి కాగా ఉదయం బడేసాబ్ ని అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించారు. అయితే నిందితుడు బడేసాబ్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కర్నూలు బళ్ళారి రహదారిపై బాలిక తల్లిదండ్రులు బంధువులు రాస్తారోకో చేపట్టారు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ధర్నా ను విరమించారు.

ఓటర్ లిస్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కోడుమూరు : ఓటరు జాబితాలో మరణించిన,పెళ్లి అయి వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారిని, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించి నోటీసులు అందించి ఓటర్ లిస్ట్ ప్యూరిఫై కార్యక్ర మాన్ని పగడ్బందీగా నిర్వహించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ బిఎల్ఓ లకు సూచించారు. మంగళవారం కోడుమూరు తహసిల్దార్ కార్యాలయం చేరుకున్న ఆయన తహసిల్దార్ బి జయన్న,డిప్యూటీ తహసిల్దార్ రామాంజనేయులు,ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ లతో కలిసి ఓటర్ లిస్ట్ ప్యూరిఫై కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి బిఎల్ఓ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఎల్ఓ లు తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితా పై సమగ్రంగా సర్వే నిర్వహించి తుది జాబితాను సిద్ధం చేయాలన్నారు.ఇంటింటికి వెళ్లి 18 సంవత్స రాలు నిండినవారిచే ఓటరుగా నమోదు చేయించాలన్నారు.

రీ-సర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ హరిప్రసాద్

కాగా అంతకుముందు మండలంలోని వర్కూరు గ్రామంలో నిర్వ హిస్తున్న రీ- సర్వే పనులను కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. వర్కూరు గ్రామ శివారులోని పొలాల్లో జరుగుతున్న రీ సర్వే పనులను తనిఖీ చేసి సర్వే అధికార ులతో పాటు రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. వీఆర్వోలు నారాయణ,ఎల్లప్ప, సంజీవరెడ్డి,విశ్వనాథరెడ్డి, లాలప్ప,వెంకటరాముడు, వెంకటేశ్వర్లు,హరికృష్ణ,బీరప్ప, మహేష్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్,రామాంజనేయులు పాల్గొన్నారు.

31 మంది ఉపాధ్యాయులు బదిలీ

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలో జరిగిన ఉపాధ్యాయుల సాధారణ బదిలీల సందర్భంగా 31 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని మండ లంలో ఆయా పాఠశాలల అంతర్ బదిలీల్లో 12 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని ఎంఈఓ ఈరన్న మంగళవారం తెలిపారు. మండలానికి 165 ఉపా ధ్యాయుల పోస్టులు మంజూరయ్యాయని ఇందులో 85మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారని మిగిలిన 80 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. 17 మంది ఎంటిఎస్ ఉపాధ్యాయులు పని చేస్తున్నారని మండలానికి లక్ష పాఠ్యపుస్తకాలు మంజూరు కాగా ఇప్పటికే విద్యార్థులకు 70 శాతం పాఠ్య పుస్తకాలు అందిం చామన్నారు. నాణ్యమైన విద్య అందించ డానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి ఎంఎస్ ఉపాధ్యాయులను నియ మించడానికి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మద్దికేర : మంగళవారం కలియుగ ప్రత్యక్ష దైవం కోరిన కోర్కెలు తీర్చే దేవుడు ఆరోగ్య ప్రదాత కొలిచిన వారికి కొంగు బంగారు సంతాన ప్రాప్తి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం సందర్భంగా సుబ్రహ్మణ్యే శ్వర స్వామి వారికి విశేష పూజలు అర్చనలు పంచామృతాభిషేకాలు జరుపబడి నది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తాదులు పాల్గొని తమ మొక్కలు చెల్లించుకున్నారు ఆలయ నిర్వాహకులు ఎస్ విజయ ప్రసాద్ యాదవ్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం మద్దికేర.

తహసీల్దార్ కార్యాలయం పిఐఓ పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడుబూరు : ఉద్దేశ పూర్వకంగా స.హ.చట్టం దరఖాస్తును తిరస్కరించిన మండల తహశీల్దార్ కార్యాలయం పిఐఓపై స. హ. చట్టం ప్రకారం చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని ఆర్టీఐ యాక్టివిస్ట్ బొగ్గుల తిక్కన్న డిమాండ్ చేశా రు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 2023 జూన్ 10న మండలంలోని రెవెన్యూ పరిధిలో గల 20 గ్రామాలకు సంబంధించిన సీలింగ్ భూముల జాబితా మరియు నిషేధిత భూముల జాబితా కావాలని దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. అయితే సంబంధిత కార్యాలయ పిఐఓ తగిన కారణం లేకుండా ఉద్దేశ పూర్వకంగానే దరఖాస్తు రుసుము చెల్లించలేదని తన దరఖాస్తుకు సమాచారం ఇవ్వకుండా తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను దరఖాస్తు రుసుము కొరియర్ ద్వారా చెల్లించినట్లు ఆయన తెలిపారు. తనను ఇబ్బందిపెట్టాలని దురుద్దేశ్యంతో తగిన సమాచారం ఇవ్వకుండా తిరస్కరించినందుకు స. హ. చట్టం 20(1)ప్రకారం క్రమశిక్షణ చర్యలతో పాటు సెక్షన్ 20(2)ప్రకారం దరఖాస్తు ,దారునికి సమాచారం ఇచ్చేంతవరకు రోజుకు 250 రూపాయలు ప్రకారం జరిమానా విధించాలన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన పిఐఓపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కార్యాలయానికి అప్పీలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.